రాహుల్ గాంధీ కుటుంబానికి బాబ్రీ మసీదుకు పట్టిన గతే.. బీజేపీ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు 2



Neti Velugu
# నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
RNI NO. TELTEL/2023/88559
www.epaper.netivelugu.com
netivelugu63@gmail.com

నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 107 | పేజీలు : 4 | జులై 30 గురువారం 2026 | వెల రూ. 4.00/-

NALGONDA | VOL:3 | ISSUE: 107 | PAGES:4 | THURSDAY JULY 30 2026 | Rs. 4:00










**హైదరాబాద్, జూలై 29**

తాము ప్రభుత్వాధినేతలమని విర్రవీగుతున్న నేతలకు కాంగ్రెస్ హైకమాండ్ కళ్లెం వేయాలని నిర్ణయించిందా? ప్రభుత్వం కన్నా పార్టీయే సుప్రీం అనే సందేశమివ్వాలని భావించిందా? సర్కార్‌లో ఎంత పెద్దస్థాయిలో ఉన్నా.. పార్టీకి మాత్రం కార్యకర్తే అనే సంకేతం ఇచ్చిందా? ఢిల్లీలో బుధవారం జరిగిన తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశమే ప్రత్యక్ష సాక్ష్యమా? ప్రభుత్వంలోని కీలక వ్యక్తులను ఢిల్లీకి పిలిపించి ఉద్దేశపూర్వకంగానే వంశీచంద్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించిందా? తద్వారా ప్రభుత్వ పెద్దల అహంకారాన్ని తగ్గించి, వారిని అవమానించిందా? ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో పెద్దఎత్తున జరుగుతున్న చర్చ ఇది. ఢిల్లీ వర్గాలు దీనికి అవును అనే సమాధానమే ఇస్తున్నాయి. 'ముఖ్యమంత్రి అయినా, ఉప ముఖ్యమంత్రి అయినా, ప్రభుత్వంలోని కీలక మంత్రులైనా సరే అందరికంటే పార్టీయే సుప్రీం. అంతేకాదు.. ఎవరైనా తోక జాడిస్తే కట్ చేస్తం' అని ప్రభుత్వాధినేతలకు కాంగ్రెస్ హైకమాండ్ హెచ్చరికలు జారీ చేసిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా యి. కాగా, తెలంగాణ నేతల సమన్వయ సమావేశం పెట్టిన ఏఐసీసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ డుమ్మాకొట్టారు. కానీ తర్వాత జరిగిన ఛత్తీస్‌గఢ్ నేతల మీటింగ్‌కు కేసీ మాత్రం హాజరయ్యారు. ఇది దేనికి సంకేతమన్న చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతున్నది.

(మిగతా 3వ పేజీలో..)

## కేంద్రానికి ఎల్ఐసీ భారీ కానుక.. రూ.12,207 కోట్ల డివిడెండ్

- ఎల్ఐసీ నుంచి రూ.12,207 కోట్ల డివిడెండ్
- యూనియన్ బ్యాంక్ నుంచి రూ.2,853 కోట్లు
- న్యూ ఇండియా అష్యూరెన్స్ నుంచి రూ.211 కోట్లు
- పీఎస్‌బీల జీఎన్‌పీఏ 1.9 శాతానికి తగ్గుదల
- ఉమ్మడి నికర లాభం రూ.1.98 లక్షల కోట్లు

కేంద్ర ప్రభుత్వానికి ప్రభుత్వ రంగ సంస్థల నుంచి భారీగా డివిడెండ్లు అందుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి దేశంలోనే అతిపెద్ద బీమా సంస్థ ఎల్ఐసీ రూ.12,207 కోట్ల డివిడెండ్‌ను కేంద్రానికి అందించింది. అదే సమయంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రభుత్వ రంగ బీమా సంస్థల పనితీరు కూడా గణనీయంగా మెరుగుపడింది. మొండి బకాయిలు చారిత్రక కనిష్ఠానికి చేరగా, లాభాలు కొత్త రికార్డు నెలకొల్పాయి.కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎల్ఐసీ ఎండీ, సీఈఓ ఆర్. దొరైస్వామి రూ.12,207 కోట్ల

(మిగతా 3వ పేజీలో..)



## రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వం ప్రమాదంలో పడింది: కవిత

- సింగరేణికే బొగ్గు బ్లాకులు కేటాయించాలనే విన్నపాలను పట్టించుకోవడం లేదన్న కవిత
- టీజీ జెన్‌కోను రంగంలోకి దింపడం వెనుక మర్మం ఏమిటని ప్రశ్న
- ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు డ్రామా ఆడుతున్నారని విమర్శ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిల తీరు వల్ల



(మిగతా 3వ పేజీలో..)

## బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు ఎప్పటికీ క్షమాపణ చెప్పను: రాహుల్ గాంధీ

- అమిత్ షాపై రాహుల్ గాంధీ మరోసారి ఆరోపణలు
- క్షమాపణ చెప్పబోనని స్పష్టీకరణ
- విద్యార్థులపై పెల్లెట్ గన్స్ వాడారని ఆరోపణ
- మేకులున్న లాఠీలు, షాక్ బ్యాటన్ల ప్రస్తావన
- అమిత్ షా పోలీసులతో మాట్లాడారని వ్యాఖ్య
- రాహుల్ ఆరోపణలను ఖండించిన కేంద్రం

లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పేందుకు కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నిరాకరించారు. జంతర్‌మంతర్‌లో నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు

(మిగతా 3వ పేజీలో..)



## పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం.. లోక్‌సభలో పరీక్షల సవరణ బిల్లుకు ఆమోదం

- పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు 2026కు లోక్‌సభ ఆమోదం
- పరీక్షల అక్రమాలకు పాల్పడితే 10 ఏళ్ల జైలు, రూ.10 కోట్ల వరకు జరిమానా
- ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు.. మూడు నెలల్లోగా తీర్పునకు నిబంధన
- నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థుల నిరసనలు, మంత్రి రాజీనామా నేపథ్యంలో ఈ పరిణామం
- పరీక్షల వ్యవస్థలో పారదర్శకత పెంచడమే లక్ష్యమని ప్రభుత్వం వెల్లడి

దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన పరీక్షల పేపర్ లీకేజీలు, అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. ఇందులో భాగంగా 'పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు-2026'కు లోక్‌సభ బుధవారం ఆమోదముద్ర వేసింది. రెండు

(మిగతా 3వ పేజీలో..)



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

# పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం.. లోక్‌సభలో పరీక్షల సవరణ బిల్లుకు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

రోజుల పాటు వాడివేడిగా సాగిన చర్చల అనంతరం వాయిస్ ఓటు ద్వారా ఈ కీలక బిల్లును సభ ఆమోదించింది. పరీక్షల వ్యవస్థలో పారదర్శకతను పెంచడం, విద్యార్థుల భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా ఈ చట్టాన్ని తీసుకొచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. 2024 నాటి చట్టానికి సవరణలు చేస్తూ రూపొందించిన ఈ కొత్త బిల్లులో అత్యంత కఠినమైన నిబంధనలను చేర్చారు. దీని ప్రకారం పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే దోషులకు గరిష్ఠంగా 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అంతేగాక దోషుల ఆస్తులను జప్తు చేసే అధికారాన్ని కూడా ఈ చట్టం కల్పిస్తుంది. ఈ తరహా కేసుల విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయనున్నారు. ఈ కోర్టులు మూడు నెలల వ్యవధిలోనే విచారణ పూర్తి చేసి తీర్పు వెలువరించాల్సి ఉంటుంది. ఇటీవల నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా పెను దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా కఠినమైన చట్టం తీసుకువస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. ఆ తర్వాత కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. నీట్ అక్రమాలు, ఇతర పరీక్షల్లో అవకతవకాలపైన జులై 20న 'కాక్‌రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఆధ్వర్యంలో ఢిల్లీలో 'సంసద్ చలో' పేరిట వందలాది మంది విద్యార్థులు భారీ నిరసన చేపట్టారు. ఈ ఆందోళన హింసాత్మకంగా మారడంతో పోలీసులు, నిరసనకారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జులై 25న తన పదవికి రాజీనామా చేశారు. ఈ రాజకీయ ఒత్తిడి, దేశవ్యాప్త నిరసనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన చట్టాన్ని తీసుకురావడం గమనార్హం.

# ప్రభుత్వం కాదు.. పార్టీయే సుప్రీం..!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర నేతలకు ఘోర అవమానం!!

బుధవారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్రం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, సీతక్క రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీనటరాజన్ పాల్గొన్నారు. సమావేశానికి ఖర్గే, కేసీ వేణుగోపాల్ డుమ్మా కొట్టారు. వారి స్థానంలో సీడబ్ల్యూసీ సభ్యుడు, రాష్ట్రానికి చెందిన జూనియర్ నేత వంశీచంద్‌రెడ్డిని పంపించారు. ఆయన అధ్యక్షతన సమావేశం జరిగింది. హోదా ప్రకారం వంశీచంద్‌రెడ్డిదే పైచేయి అయినా, రాష్ట్రానికి చెందిన కీలక నేతల సమావేశానికి అధ్యక్షత వహించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చర్య ద్వారా రాష్ట్ర కీలక నేతలను కాంగ్రెస్ హైకమాండ్ ఘోరంగా అవమానించిందని, కాంగ్రెస్ నేతలు ఢిల్లీ వేదికగా తెలంగాణ ఆత్మగౌరవాన్ని మరోసారి తాకట్టు పెట్టారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కావాలనే 'పెద్దల' డుమ్మా !

రాష్ట్ర ముఖ్యనేతను, ఇతర కీలక నేతలను తక్కువ చేసే ఉద్దేశంతోనే హైకమాండ్ ఇలాంటి ఎత్తుగడ వేసిందనే చర్చ జరుగుతున్నది. ఖర్గే, కేసీ కావాలనే డుమ్మా కొట్టారని చెప్పుకొంటున్నారు. రాష్ట్ర నేతలకు కీలక సంకేతాలు పంపించాలనే ముందస్తు ప్రణాళికలో భాగంగానే అధిష్ఠానం పెద్దలు వారిద్దని సమావేశానికి వెళ్లొద్దని చెప్పినట్లు ఢిల్లీ వర్గాలు తెలిపాయి. పార్లమెంట్ సమావేశాలు ఉండటం వల్లే హాజరుకాలేకపోయారని వారిద్దరూ చెప్పినట్టు సమాచారం. కేసీ ఢిల్లీలోనే జరిగిన ఛత్తీస్‌గఢ్ నేతల సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. దీంతో రాష్ట్ర నేతలకు, వేణుగోపాల్‌కు మధ్య దూరం పెరిగిందని ప్రచారం జరుగుతున్నది. రాష్ట్ర నేతలపై కేసీ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. ప్రభుత్వంతో ఎంత పెద్ద వారైనా పార్టీలో కిందివారే అనే సంకేతాలు ఇచ్చేందుకే వంశీచంద్‌రెడ్డిని కీలక స్థానంలో కూర్చోబెట్టి సమావేశం నిర్వహించారని తెలుస్తున్నది.

# రాహుల్ గాంధీ కుటుంబానికి బాబ్రీ మసీదుకు పట్టిన గతే.. బీజేపీ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు


**కర్ణాటక ఎమ్మెల్యే యశ్‌పాల్ సువర్ణపై ఎఫ్ఐఆర్ నమోదు**
**బాబ్రీ మసీదు ఘటనను ప్రస్తావిస్తూ విమర్శలు**
**కాంగ్రెస్ ఫిర్యాదుతో కేసు నమోదు**
**వ్యాఖ్యలపై రాజకీయ దుమారం**
**కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్**



లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కుటుంబంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే యశ్‌పాల్ సువర్ణపై పోలీసులు కేసు నమోదు చేశారు. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేసిన ఘటనను ప్రస్తావిస్తూ, కాంగ్రెస్ ఇదే తరహా రాజకీయాలు కొనసాగిస్తే రాహుల్ గాంధీ కుటుంబానికీ అదే పరిస్థితి వస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. సామాజిక మాధ్యమాల్లో ప్రసంగం వీడియో వైరల్ కావడంతో కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. ఉడుపిలో నిర్వహించిన బీజేపీ కార్యక్రమంలో యశ్‌పాల్ సువర్ణ ఈ వ్యాఖ్యలు చేశారు. దీనిపై ఉడుపి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అశోక్ కుమార్ కొడవూర్ ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదైంది. భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విద్వేషాన్ని రెచ్చగొట్టేలా, బెదిరింపులకు పాల్పడేలా ఎమ్మెల్యే మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై కర్ణాటక కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మంజునాథ్ భండారి తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని ప్రమాణం చేసిన ప్రజాప్రతినిధి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ వివాదం, దేశవ్యాప్త నిరసనల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే రాహుల్ గాంధీపై బీజేపీ వ్యక్తిగత విమర్శలకు దిగుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఉన్న ఇతర బీజేపీ ప్రజాప్రతినిధులు కూడా ఈ వ్యాఖ్యలను ఖండించకపోవడం ఆందోళనకరమని అన్నారు.

## తమిళనాడు స్కూళ్లలో ఘుమఘుమలు.. మధ్యాహ్న భోజనంలో చికెన్ బిర్యానీ ప్రతిపాదన

పాఠశాల విద్యార్థులకు మరింత పౌష్టికాహారం అందించడంతో పాటు భోజనాన్ని ఆసక్తికరంగా మార్చేందుకు తమిళనాడులోని విజయ్ ప్రభుత్వం ఒక కీలక ప్రతిపాదనను పరిశీలిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వారానికి ఒకసారి 'చికెన్ బిర్యానీ' అందించే అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా యోచిస్తోంది. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే, దేశంలోనే సుదీర్ఘకాలంగా అమలవుతున్న ఈ పథకంలో ఇదొక ముఖ్యమైన మార్పు అవుతుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉంది. మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్న సాంఘిక సంక్షేమ, మహిళా సాధికారత శాఖతో సంప్రదింపులు జరిపిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. విద్యార్థుల సంక్షేమం, ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెంచే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. వారానికి ఒకసారి ప్రోటీన్లు అధికంగా ఉండే చికెన్ బిర్యానీని అందించడం వల్ల విద్యార్థుల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో పాటు భోజనం నాణ్యతను, ముఖ్యంగా పాఠశాలలకు సరఫరా చేసే బియ్యం నాణ్యతను మెరుగుపరిచే అంశంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రస్తుతం తమిళనాడులో 1 నుంచి 10వ తరగతి వరకు సుమారు 40 లక్షల మంది విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. అలాగే ముఖ్యమంత్రి అల్పాహార పథకం ద్వారా 1 నుంచి 8వ తరగతి వరకు 32 లక్షల మంది పిల్లలకు ప్రయోజనం చేకూరుతోంది. ఈ రెండు పథకాలను 11, 12 తరగతులకు కూడా విస్తరించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. దీనివల్ల మరో 8 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని అంచనా. హయ్యర్ సెకండరీ విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం వల్ల వారి హాజరు మెరుగుపడి, డ్రాపవుట్లు తగ్గుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దేశంలో ఇలాంటి పథకాలకు మార్గదర్శకంగా నిలిచిన తమిళనాడు, చికెన్ బిర్యానీ ప్రతిపాదనతో మరో ముందడుగు వేసినట్టు అవుతుంది.






## బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎప్పటికీ క్షమాపణ చెప్పను: రాహుల్ గాంధీ

(మొదటి పేజీ తరువాయి)

బలప్రయోగం చేయడంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాత్ర ఉందన్న ఆరోపణలను మరోసారి పునరుద్ఘాటించారు. "అమిత్ షానే ఆదేశాలు ఇచ్చి ఉండాలి.. లేకపోతే ఏం జరుగుతోందో ఆయనకు తెలియకపోయి ఉండాలి" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ సమావేశం వాయిదా పడిన తర్వాత కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాహుల్ మాట్లాడారు. క్షమాపణ చెబితే ప్రసంగం కొనసాగించేందుకు అవకాశం ఇస్తామని తనకు చెప్పారని, కానీ బీజేపీకి, ఆర్‌ఎస్‌ఎస్‌కు తాను ఎప్పటికీ క్షమాపణ చెప్పబోనని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా దేశానికి సంబంధించిన కీలక అంశాలను లేవనెత్తే హక్కు తనకు ఉందని అన్నారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి వ్యతిరేకంగా ఆందోళన చేసిన విద్యార్థులపై పెల్లెట్ గన్స్ వాడారని రాహుల్ ఆరోపించారు. ఒక విద్యార్థి కంటి చూపు కోల్పోయే పరిస్థితి వచ్చిందని, దీనికి సంబంధించిన ఎయిమ్స్ వైద్య నివేదికను తాను చూశానని చెప్పారు. మేకులున్న లాఠీలు, షాక్ బ్యాటన్లతో మహిళలు, మైనర్లపై కూడా దాడులు చేశారని ఆరోపించారు. నిరసన సమయంలో అమిత్ షా పోలీసు అధికారులతో మాట్లాడడం తాను స్వయంగా చూశానని కూడా పేర్కొన్నారు. ఆ తర్వాత జితేంద్ర సింగ్ కు అమిత్ షా నుంచి వరుసగా కాల్స్ వచ్చాయని అన్నారు. అంతకుముందు లోక్‌సభలో రాహుల్ చేసిన ఆరోపణలపై అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తన వ్యాఖ్యలకు ఆధారాలు చూపాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. స్పీకర్ ఓం బిర్లా కూడా ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయొద్దని సూచించారు. మరోవైపు రాహుల్ ఆరోపణలను కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ పూర్తిగా ఖండించారు. నిరసనల సమయంలో కాల్పులు జరగలేదని, అలాంటి ఆదేశాలు కూడా ఇవ్వలేదని స్పష్టం చేశారు.

## కేంద్రానికి ఎల్ఐసీ భారీ కానుక.. రూ.12,207 కోట్ల డివిడెండ్

(మొదటి పేజీ తరువాయి)

డివిడెండ్ చెక్కును బుధవారం అందజేశారు. ఈ విషయాన్ని ఆర్థిక మంత్రి 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. అలాగే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈఓ అశీష్ పాండే రూ.2,853 కోట్ల డివిడెండ్ చెక్కును అందించారు. న్యూ ఇండియా అష్యూరెన్స్ సీఎండీ గిరిజా సుబ్రహ్మణియన్ రూ.211 కోట్ల డివిడెండ్‌ను అందజేశారు. ప్రభుత్వ రంగ సంస్థల బలమైన ఆర్థిక పనితీరుకు ఇవి నిదర్శనమని ప్రభుత్వం పేర్కొంది. ఈ సందర్భంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల ఆర్థిక స్థితిపై కూడా కేంద్రం వివరాలు వెల్లడించింది. 2025-26లో ప్రభుత్వ రంగ బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తుల (జీఎన్‌పీఏ) నిష్పత్తి 1.9 శాతానికి పడిపోయింది. ఇది ఇప్పటివరకు నమోదైన కనిష్ఠ స్థాయి. మరోవైపు ఈ బ్యాంకుల ఉమ్మడి నికర లాభం రూ.1.98 లక్షల కోట్లకు చేరింది. వరుసగా నాలుగో ఏడాది లాభాలను నమోదు చేయడం విశేషం. సంస్కరణలు, మెరుగైన పాలన, బలమైన మూలధన స్థితి ఈ ఫలితాలకు ప్రధాన కారణాలుగా ప్రభుత్వం పేర్కొంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం 2025-26లో ప్రభుత్వ రంగ బ్యాంకుల నికర లాభం ఏడాది ప్రాతిపదికన 11.1 శాతం పెరిగింది. రుణాల వృద్ధి, వడ్డీ ఆదాయం పెరగడం, ఆస్తుల నాణ్యత మెరుగుపడటం లాభాలకు బలాన్నిచ్చాయి. 2026 మార్చి 31 నాటికి ఈ బ్యాంకుల మొత్తం వ్యాపారం రూ.283.3 లక్షల కోట్లకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 12.8 శాతం వృద్ధిని నమోదు చేసింది. మార్చి 31 నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకుల నికర నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) నిష్పత్తి 0.39 శాతానికి తగ్గింది. ప్రతి ప్రభుత్వ రంగ బ్యాంకు 90 శాతానికి పైగా ప్రొవిజనింగ్ కవరేజ్ రేషియోను కొనసాగించింది. రుణాల మంజూరులో మెరుగైన ప్రమాణాలు, సమర్థమైన రిస్క్ మేనేజ్‌మెంట్ బ్యాంకుల ఆర్థిక బలాన్ని మరింత పెంచాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వం ప్రమాదంలో పడింది: కవిత

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణకే గర్వకారణమైన సింగరేణి సంస్థ తన అస్తిత్వాన్ని, ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ వేలం ద్వారా కాకుండా నేరుగా సింగరేణి సంస్థకే బొగ్గు బ్లాకులను కేటాయించాలన్న విజ్ఞప్తులను పట్టించుకోకుండా... మణుగూరు పీకేవోసీపీ (PKOCP) బొగ్గు బ్లాక్ వేలం నిర్వహించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆమె ఆరోపించారు. సింగరేణి నేరుగా వేలంలో పాల్గొంటుందని పైకి ప్రకటించిన ప్రభుత్వం, తెరవెనుక మాత్రం టీఎస్ జెన్‌కోను పోటీలోకి తెచ్చేలా కుట్రపూరిత ప్రయత్నాలు చేస్తోందని కవిత మండిపడ్డారు. బొగ్గు తవ్వకాల్లో శతాబ్దాల అనుభవం, ప్రావీణ్యం ఉన్న సింగరేణి సంస్థకు పోటీగా.. ఎలాంటి అనుభవం లేని టీఎస్ జెన్‌కోను రేసులోకి దింపడం వెనుక ఉన్న మర్మమేమిటో రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జెన్‌కో ద్వారా బొగ్గు బ్లాకులను దక్కించుకుని, ఆ తర్వాత అనుభవం లేదనే నెపంతో వాటిని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ఈ ముసుగు డ్రామా ఆడుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. సింగరేణి భవిష్యత్తు, అభివృద్ధిపై కిషన్ రెడ్డికి నిజంగానే చిత్తశుద్ధి ఉంటే, వేలం ప్రక్రియతో సంబంధం లేకుండా నేరుగా కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ వేలం పోటీ నుంచి టీఎస్ జెన్‌కోను రాష్ట్ర ప్రభుత్వం తప్పించాలని డిమాండ్ చేశారు.



# లో వోల్టేజి సమస్య పై ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్ కి ఫోన్

**విద్యుత్ శాఖ సమీక్షలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి**

**మునుగోడు జూలై 29 నేటి వెలుగు ప్రతినిధి**





ఎల్ నినో ప్రభావంతో వాతావరణం లో కీలకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని దీని ప్రభావంతో వర్షాలు తక్కువ పడే అవకాశం ఉన్న నేపథ్యంలో మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా కేవలం బోరుబావుల పైన వ్యవసాయం ఆధారపడి ఉందని ఆ బోరుబావులకు విద్యుత్ సక్రమంగా అందిస్తూ ఎటువంటి సమస్య లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులు ఆదేశించారు గౌరవ మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మునుగోడు లోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న విద్యుత్ సమస్యలపై యాదాద్రి భువనగిరి జిల్లా నల్గొండ జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.. కరెంట్ అనేది జీవనంలో భాగమైందని కరెంటుకి మొదటి ప్రధానమంత్రి ఇవ్వాలన్నారు.. మునుగోడు నియోజకవర్గాన్ని విద్యుత్ లో రోల్ మోడల్ గా చేయడంలో భాగంగా మొదటగా మండల కేంద్రాలలో ఎటువంటి విద్యుత్ సమస్యలు లేకుండా చేసి, తర్వాత గ్రామాలలోని విద్యుత్ సమస్యల పరిష్కారం, అనంతరం వ్యవసాయ బావుల లైన్స్ ను విడతల వారీగా అభివృద్ధి చేసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు... మొదటగా అన్ని మండల కేంద్రాలలో గృహాలపై విద్యుత్ తీగలు లేకుండా లైన్స్ షిఫ్ట్ చేసి ఎటువంటి విద్యుత్ సమస్య లేకుండా అంచనాలు రూపొందించాలన్నారు.. మునుగోడు ఏఈ నరేందర్ ని ఫోన్ లో పరామర్శించిన ఎమ్మెల్యే ఇటీవల సిబ్బంది అధికారుల పని ఒత్తిడి, వేధింపుల వల్ల ఇబ్బంది పడుతూ ఆసుపత్రి పాలైన మునుగోడు మండల ఫోన్లో పరామర్శించారు.. డిపార్ట్మెంట్లో ఏం జరుగుతుందో చూసుకోవాల్సిన బాధ్యత పై స్థాయిలో ఉన్న అధికారులపై ఉందని మందలించారు.. నరేందర్ కు ధైర్యం చెబుతూ వెంటనే విధులకు హాజరుకావాలని నేను నీకు భరోసాగా ఉంటానని హామీ ఇచ్చారు... లో వోల్టేజి సబ్ స్టేషన్ ల నిర్మాణం పై ట్రాన్స్కో సీఎం డి కృష్ణ భాస్కర్ కి ఫోన్ వర్షభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో బోరుబావుల పైన విపరీతమైన ఒత్తిడి ఉండడంతో మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా లోగో సమస్య అధికమవుతుందని అదేవిధంగా నిర్మించాల్సిన మంజూరైన సబ్ స్టేషన్లను త్వరితగతిన పూర్తి చేసే విధంగా సహకరించాలని ట్రాన్స్కో సీఎండీ కృష్ణ భాస్కర్ కి ఫోన్లో వివరించారు.. సీఎండీ కృష్ణ భాస్కర్ మునుగోడు నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు... ఇప్పటివరకు నియోజకవర్గ వ్యాప్తంగా సబ్ స్టేషన్ల పనితీరుపై చర్చించారు... ఇప్పటివరకు మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా 31 సబ్స్టేషన్లు పనిచేస్తుండగా... కొత్తగా నిర్మించిన 6 సబ్స్టేషన్లు ఉపయోగం లోకి వచ్చాయి.. మరో 3 సబ్ స్టేషన్లు నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉండగా..ఇంకో 6 సబ్స్టేషన్లు మంజూరై టెండర్ ప్రాసెస్ లో ఉన్నాయి.. మరో 3 సబ్స్టేషన్లు మంజూరై భూమి కేటాయింపు స్టేజిలో ఉన్నాయి.. వివిధ దశలలో ఉన్న ఈ సబ్ స్టేషన్ లను త్వరితగతిన పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు... మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా భద్రతతో కూడిన నాణ్యమైన కరెంటు ని ఇచ్చే విధంగా కరెంట్ అభివృద్ధి పనులు చేయాలన్నారు... ఈ సమీక్ష సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్ ఈ. సురేష్, నల్గొండ కన్స్ట్రక్షన్ డిఈ నరసింహ, దేవరకొండ డిఈ బాల్య నాయక్, నల్గొండ డీఈ విద్యాసాగర్, చౌటుప్పల్ డిఇ మల్లికార్జున్, నాంపల్లి మునుగోడు చౌటుప్పల్ ఏడీఈలు, అన్ని మండలాల ఏఈ లతోపాటు నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు....

# ప్రభుత్వ భూముల సర్వే సమయంలో పరిశీలన పక్కగా జరగాలి : జిల్లా కలెక్టర్ బి.చంద్ర శేఖర్






**చందంపేట జూలై 29 నేటి వెలుగు ప్రతినిధి**


రెవెన్యూ రికార్డులను పక్కగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్ర శేఖర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం అయన నల్గొండ జిల్లా, దేవరకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని చందంపేట తహసిల్దార్ కార్యాలయాన్ని దేవరకొండ ఆర్డిఓ బి. పద్మ ప్రియతో కలిసి సందర్శించి తహసిల్దార్ సత్యనారాయణ, సిబ్బందితో రెవెన్యూ అంశాలపై సమీక్షించారు . ఇటీవల చేపట్టిన భూముల రీ సర్వే, అటవీ భూములు, రెవెన్యూ భూములు, సాధారణ సర్వే లో సమస్యలు, తదితర అంశాలపై గ్రామాల వారిగా ఆర్డిఓ, తహసిల్దారుతో సమీక్షించారు. ప్రభుత్వ భూముల సర్వే సమయంలో పరిశీలన పక్కగా జరగాలని, ముఖ్యంగా అటవీభవములు, రెవిన్యూ భూములు ,ప్రభుత్వ భూముల సర్వే సమయంలో క్షేత్రస్థాయికి వెళ్లి రైతుల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. మండలంలోని బొల్లారం పట్టి, అచ్చంపేట పట్టీలకు ప్రాధాన్యత ఇచ్చి ఆ రెండు గ్రామాలకు సంబంధించిన భూ రికార్డులను స్పష్టత వచ్చే విధంగా రూపొందించాలని చెప్పారు. వారం, పది రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాలలో భూ రికార్డుల లో స్పష్టత తీసుకురావాలని తహసిల్దారును ఆదేశించారు. ఇందుకు గాను ప్రతిరోజు కనీసం 3 నుండి 4 గంటలు ఈ అంశంపై పనిచేయాలని ఆదేశించారు. భూముల రీ-సర్వే సందర్భంగా తలెత్తుతున్న సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మండలంలో భూములకు సంబంధించిన రికార్డుల పరిశీలన, రీ -సర్వే అంశాలను ఆర్డిఓ నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పొగిళ్ళకు సంబంధించి రికార్డులను ఇదివరకే పరిశీలించినందున వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి పొగిళ్ల రికార్డులను కూడా సిద్ధం చేయాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

# ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను 100 శాతం పూర్తి చేయాలి- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్గొండ జూలై 29 నేటి వెలుగు ప్రతినిధి**

జిల్లాలో రైతుల ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రస్తుతం 68 శాతం పూర్తైందని, మిగిలిన రిజిస్ట్రేషన్‌ను త్వరితగతిన పూర్తి చేసి 100 శాతం లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ మండల వ్యవసాయ అధికారులు, ఉద్యానవన శాఖ మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలని, ప్రతిరోజూ కనీసం 5,000 మంది రైతుల నమోదు లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ అన్నారు. రైతులకు అవసరమైన అవగాహన కల్పిస్తూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అన్నారు.వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కందులు, పెసర్లు వంటి ఆరుతడి పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని సూచించారు. అలాగే కూరగాయల సాగును కూడా విస్తరించేలా రైతులకు మార్గనిర్దేశం చేయాలని తెలిపారు. వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను నిర్ణీత గడువులోగా 100 శాతం పూర్తి చేయడంతో పాటు, రైతులకు పంటల ఎంపికపై అవసరమైన సలహాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లోజిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్ ,జిల్లా హార్టికల్చర్ అధికారి టి. శేఖర్ , జిల్లా విద్యాశాఖ అధికారి సుసింధర్ రావు పాల్గొన్నారు .




# గౌతమి పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో 'పోలీస్ అక్క' అవగాహన కార్యక్రమం ..

- మహిళలు, బాలికల భద్రతకు తెలంగాణ పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత -- అడిషనల్ ఎస్పీ రమేష్..






**నల్గొండ జిల్లా జూలై 29 నేటి వెలుగు ప్రతినిధి**

నల్లగొండ జిల్లాలో మహిళలు, బాలికల భద్రత, రక్షణే లక్ష్యంగా షీ టీం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'పోలీస్ అక్క' కార్యక్రమంలో భాగంగా బుధవారం నల్లగొండ పట్టణంలోని గౌతమి ఇంగ్లీష్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నల్లగొండ అడిషనల్ ఎస్పీ రమేష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులు ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ, మహిళలు మరియు బాలికల భద్రతకు తెలంగాణ పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళలపై వేధింపులు, ఈవ్ టీజింగ్, అసభ్య ప్రవర్తన, వెంటపడటం (స్టాకింగ్), సోషల్ మీడియా ద్వారా వేధింపులు, బ్లాక్‌మెయిల్, సైబర్ నేరాలు వంటి ఘటనల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఎవరైనా మహిళలు లేదా విద్యార్థినులు ఇటువంటి వేధింపులకు గురైతే వెంటనే పోలీసులను లేదా షీ టీమ్‌ను సంప్రదించాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచి, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ, అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులు, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. ఏవైనా అనుమానాస్పద సంఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.విద్యార్థులు చదువుతో పాటు మంచి నడవడిక, క్రమశిక్షణ అలవర్చుకోవాలని, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. మహిళల పట్ల గౌరవభావంతో వ్యవహరించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.అనంతరం షీ టీం అధికారులు మహిళల భద్రత కోసం అందుబాటులో ఉన్న సేవలు, అత్యవసర సహాయ నంబర్లు, భరోసా కేంద్రాల సేవలు, సైబర్ మోసాల నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ మంజుల, భరోసా కేంద్రం ఎస్ఐ అమీన్, రూరల్ ఎస్ఐ శివకుమార్, షీ టీం ఎస్.ఐ గౌస్, పాఠశాల కరస్పాండెంట్ రమేష్ రెడ్డి, అధికారులు, పోలీసు సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# నార్కెట్పల్లి ఎస్సై పై చర్యలు తీసుకోవాలి

**నల్గొండ జూలై 29 నేటి వెలుగు ప్రతినిధి**

నార్కెట్పల్లి ఎస్ఐ పై చర్యలు తీసుకోవాలని తంగేళ్ల రజిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నార్కెట్పల్లి మండలం షా పల్లి గ్రామానికి చెందిన జాల నరసింహ, జాల కేతమ్మ, మాధవి, నరేష్, లింగస్వామి, బుర్ర లింగయ్య, బుర్ర మల్లేష్, అనే వ్యక్తులు నా భర్త సైదిరెడ్డి తోపాటు నా కుమారుడిని,నా మీద దాడి చేసి నా భర్తను తీవ్రంగా గాయపరిచారని తెలిపారు.ఈ విషయంపై నార్కెట్పల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.మా దరఖాస్తును పక్కనపెట్టి దాడి చేసిన వారి దరఖాస్తులు స్వీకరించి నా భర్తను రెండు రోజులపాటు పోలీస్ స్టేషన్లో ఉంచడం జరిగిందన్నారు.దాడి చేసిన వ్యక్తులు ఎమ్మెల్యేకు చెందిన వారిని వారిపై చర్యలు తీసుకోకుండా ఎస్సై మమ్ములను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. దాడిలో గాయపడిన నా భర్తను చికిత్స కోసం హాస్పిటల్ లోకి తీసుకపోతమన్న పంపలేదు అన్నారు. తీవ్ర అనారోగ్యంతో ఉండడంతో బుధవారం హాస్పిటల్ లోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఛాతి ఎముకలు విరగడంతో రెండు రోజులు కావడంతో బాడీ ఇన్ఫెక్షన్ తో ఇప్పుడు నా భర్త ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పోలీసుల ద్వారా చికిత్స చేయించమని అడిగిన చేయించలేదని తెలిపారు. ఈ సంఘటనపై పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి ఎస్సై పై చర్యలు తీసుకొని అదేవిధంగా దాడికి పాల్పడిన దుండగులపై చర్యలు తీసుకోవాలని కోరారు.పైన తెలిపిన దుండగులు ఈనెల 25న నా వ్యవసాయ భూమిలో బోరు వేసుకునే క్రమంలో బండికి అడ్డం తిరిగి మాపై దాడికి పాల్పడ్డారని అన్నారు.దుండగులకున్న అధికార పార్టీ బలం తో మమ్ములను చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు.పెద్దమనుషుల సమక్షంలో కూడా కొట్టడం జరిగిందని రాజకీయ రంగు పూస్తూ అధికార పార్టీ అహంకారంతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నా భర్తకు ఏమి జరిగినా స్థానిక ఎస్సై బాధ్యత వహించాలని అన్నారు.



## ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలి - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి




**రంగారెడ్డి జిల్లా జూలై 29 నేటి వెలుగు ప్రతినిధి**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ.లతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన




ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను బి.ఎల్.ఓ. సూపర్వైజర్లు, ఏ.ఈ.ఆర్.ఓ.లు, ఈ.ఆర్.ఓ.లు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు అనర్హుల పేర్ల తొలగింపు, ఓటరు వివరాల సవరణ వంటి ప్రక్రియలను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను నియమ నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని, ప్రతి పోలింగ్ కేంద్రంలో 1200 ఓటర్లకు మించి ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ఒక కుటుంబానికి సంబంధించిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు కలిగి ఉండేలా హేతుబద్ధీకరణను చేపట్టాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి, వాటికి సంబంధించిన వివరాలు డాక్యుమెంటేషన్ చేయాలని తెలిపారు. ఎ.ఎస్.డి. జాబితా తయారు చేసిన తరువాత సంబంధిత బూత్ స్థాయి ఏజెంట్ సంతకం తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. . కొన్ని కాలనీల్లో ఒకే కుటుంబం లేదా ఒకే నివాస సముదాయంలోని ఓటర్లు రెండు వేర్వేరు పోలింగ్ కేంద్రాలకు విభజించబడిన సందర్భాలు ఉన్నాయని, అలాంటి సమస్యలను ప్రస్తుత హేతుబద్ధీకరణ దశలో పూర్తిగా పరిష్కరించడం సాధ్యం కానప్పటికీ, ముసాయిదా ఓటరు జాబితా (డ్రాఫ్ట్ రోల్ ) ప్రచురించిన తర్వాత ఫారం--8 ద్వారా సవరణలు చేపట్టేలా ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. ఓటర్లకు సౌకర్యవంతంగా ఉండేలా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు దిశగా పని చేస్తున్నామని చెప్పారు. రాజకీయ పార్టీలతోనూ నిరంతర సమావేశాలు కొనసాగిస్తున్నామని, అన్ని నియోజకవర్గాలు, మండలాల్లో సమావేశాలు నిర్వహించి పెండింగ్ అంశాల వివరాలను వారికి అందజేశామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శారద, ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి రాణించినప్పుడే విద్యా వ్యవస్థకు సార్థకత: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట జూలై 29 నేటి వెలుగు ప్రతినిధి**

సూర్యాపేట జిల్లాను విద్యా రంగంలో మరింత అగ్రపథాన నిలిపేందుకు ఉపాధ్యాయులు నడుం బిగించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లకు నిర్వహిస్తున్న మూడు రోజుల సమగ్ర వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం  కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు, బాధ్యతలపై దిశా నిర్దేశం చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి గానూ పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ లో సూర్యాపేట జిల్లా ప్రచేష్ట -1 లో స్థానాన్ని సాధించడం పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేస్తూ విద్యాశాఖ బృందాన్ని అభినందించారు. ఆ పాత పద్ధతులు వద్దు.. కొత్తగా బోధించండి ప్రపంచీకరణ వేగంగా విస్తరిస్తున్న తరుణంలో విద్యార్థుల భవిష్యత్తు అవసరాలను గుర్తించి తరగతి గది బోధన సాగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా.. కృత్యాధార బోధన, ప్రయోగాలు, ప్రాజెక్టులు, గ్రూప్ డిస్కషన్స్ ద్వారా విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ను ఉపాధ్యాయులు సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఆదేశించారు. చదువుతో పాటు విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి సాధించేలా పర్యవేక్షించడానికి ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. తోటలో అన్ని పూలూ వికసించాలి ఒక తోటలోని కొన్ని మొక్కలు మాత్రమే పూలిస్తే ఆ తోటకు అందం రాదని అన్ని మొక్కలూ పూలు పూసి వికసిస్తేనే ఆ శోభనిస్తుందని,  అలాగే క్లాస్ రూమ్‌లో కేవలం కొందరు విద్యార్థులు మాత్రమే కాకుండా, ప్రతి ఒక్కరూ రాణించి ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే విద్యా వ్యవస్థ అసలైన లక్ష్యం నెరవేరుతుందని కలెక్టర్  ఉదాహరణతో వివరించారు. ప్రతి విద్యార్థి నైపుణ్యాలు సాధించేలా చూడాల్సిన పూర్తి బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని, సూర్యాపేట జిల్లాను విద్యా రంగంలో మరింత మెరుగైన స్థానంలో నింపాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఈవో కే. అశోక్, సెక్టోరియల్ అధికారులు హరికృష్ణ, రేణుక, సెంటర్ ఇంచార్జ్ నాగరాణి, జిల్లా రిసోర్స్ పర్సన్లు శ్రీహరి శ్రవణ్, సత్యనారాయణ రెడ్డి, యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.



# డ్రోన్‌తో మహిళల ఆర్థిక స్వావలంబనకు నాంది





**నల్గొండ జూలై 29 నేటి వెలుగు ప్రతినిధి**

మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి కోటీశ్వరులుగా,  మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. బుధవారం జిల్లా మహిళా సమాఖ్య లో నిర్వహించిన నీలగిరి జిల్లా  మహిళా సమాఖ్య కిసాన్ డ్రోన్ ఆపరేటర్ల మిరాయి సంస్థ 10 రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పూర్తి చేసిన మహిళలకు అభినందనలు తెలిపారు.  స్వయం సహాయక సంఘాలకు చెందిన 50 మంది మహిళలకు సి ఎస్ ఆర్ డ్రోన్ ఆపరేటర్  శిక్షణ ఇవ్వడం ఎంతో సంతోషకరమని కలెక్టర్ అన్నారు. శిక్షణలో డ్రోన్ నిర్వహణతో పాటు, మరమ్మతులు, నిర్వహణ, భద్రతా ప్రమాణాలపై పూర్తి అవగాహన కల్పించారని తెలిపారు.ఈ శిక్షణ ద్వారా మహిళలు ఉపాధి అవకాశాలను సృష్టించుకోవడంతో పాటు, ఇతరులకు కూడా సేవలు అందించగలరని అన్నారు. జిల్లాలో  సాగు భూమి  ఎంతో ఉందని, అందులో కనీసం 6 లక్షల ఎకరాల్లో డ్రోన్ సేవలు అందించే అవకాశం ఉందన్నారు. ఒక్క ఎకరానికి రూ.400 చొప్పున సేవలు  మంచి ఆదాయం పొందే అవకాశం ఉందని, మహిళలు సమిష్టిగా కృషి చేస్తే మూడు నెలల్లోనే గణనీయమైన ఆదాయం సంపాదించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.ప్రతి గ్రామపంచాయతీలో డ్రోన్ సేవలు అందించే మహిళల వివరాలు, సంప్రదింపు నంబర్లు ప్రదర్శించేలా ప్రచారం చేపడతామని తెలిపారు. ఒకరికొకరు సహకరించుకుంటూ సేవలను విస్తరించాలని సూచించారు. మిరాయి సంస్థ మూడు సంవత్సరాల పాటు డ్రోన్లకు సంబంధించిన రిపేర్లు, స్పేర్ పార్ట్స్ విషయంలో సాంకేతిక సహాయం అందిస్తుందని చెప్పారు. స్త్రీ నిధి ద్వారా రుణాలు తీసుకొని ధైర్యంగా మార్కెట్లోకి అడుగుపెట్టాలని, ఇప్పటికే ఉన్న సంస్థలతో పోటీ పడే స్థాయికి ఎదగాలని మహిళలకు కలెక్టర్ సూచించారు. ప్రారంభంలో లాభాలు వెంటనే రాకపోయినా నిరుత్సాహపడకుండా కష్టపడి పనిచేయాలని, డ్రోన్ పూర్తిగా సొంతం అయ్యే వరకు సేవలను విస్తరించాలని, మహిళా రైతులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. శిక్షణ అనంతరం



అవసరమైన సాంకేతిక సహాయం అందుబాటులో ఉంటుందని కలెక్టర్ హామీ ఇచ్చారు.అనంతరం శిక్షణ పొందిన 50 మందికి సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు  ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి  శేఖర్ రెడ్డి ,మిరాయి సీఈఓ విజయ్ , హెట్రో సిఎస్ఆర్ చైర్మన్ సుధాకర్ ,పరిశ్రమల అధికారి సతీష్, నవరత్న శ్రీనివాస్,ఈశ్వర్ జిల్లా మహిళా సమాఖ్య  కార్యదర్శి సునీత ,శిక్షకులు, అధికారులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో పీఎం శ్రీ పథకం కింద చేపట్టిన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి





**వనపర్తి జిల్లా జూలై 29 నేటి వెలుగు ప్రతినిధి**

విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పీఎం శ్రీ పథకం కింద చేపట్టిన  నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం వనపర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్)లో పీఎం శ్రీ పథకం కింద నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల, సైన్స్ ల్యాబ్ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.  నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, ప్రతి దశలో నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. పనులు పూర్తయ్యే వరకు ఇంజినీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తూ నాణ్యతతో కూడిన నిర్మాణాలను అందించాలని ఆదేశించారు.నిర్మాణాలకు అవసరమైన అన్ని చర్యలను వేగవంతం చేసి సైన్స్ ల్యాబ్, అదనపు తరగతి గదులను త్వరలోనే విద్యార్థుల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. జెడ్పి సీఈవో యాదయ్య, ఈ డబ్ల్యూ ఐ డి సి ఇంజనీరింగ్ ఈ ఈ రాంచందన్, డి ఈ, ఏ ఈ అధికారులు,  పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఒత్తిడిని తగ్గించుకోవాలంటే ఏం చేయాలో తెలుసా?

ఈ రోజుల్లో ఉద్యోగ రీత్యా లేదా ప్రేమ, డబ్బు లేదా ఫ్యామిలీ పరంగా ఏదయినా కారణం చేత చాలామంది టెన్షన్ లేదా ఒత్తిడికి గురవుతారు. దీని వలన మన మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్రతి చిన్న దానికి ఎక్కువగా ఆలోచించడం వలన కూడా టెన్షన్, ఒత్తిడి వంటివి పెరుగుతాయి. మనం ఇతరులతో ఎలా మాట్లాడాలి వారు మనకు ఎలా స్పందిస్తారో ముందుగా ఊహించుకొని మనం అనుకున్న అంచానాలు రీచ్ అవ్వకపోయినా ఒత్తిడికి గురవుతారు. కాబట్టి మనం ప్రతి విషయంలో ఎలా జరిగిన దానిని స్వీకరించగలగాలి అంతేగాని దాని గురించి ఆలోచిస్తూ ఉండకూడదు. మన మూడ్ సరిగ్గా లేకపోయిన ఆ సమయంలో మనం తీసుకునే నిర్ణయాలు చెడుగా ఉంటాయి. దీని వలన మనం అవతలివారిలో నెగిటివిటీ ని పెంచిన వారమవుతాము. తరువాత మనం వారు మన గురించి ఏమి ఆలోచిస్తున్నారో అని అనుకుంటూ ఉంటాము ఇలా ఆలోచనలతో ఒత్తిడికి గురవుతాము. కాబట్టి మన మూడ్ బాగోలేనప్పుడు ఎటువంటి నిర్ణయాలు తీసుకోకపోవడమే మంచిది. లావుగా ఉన్నామని లేదా సన్నగా ఉన్నామని లేదా ఏదయినా మానసిక, శారీరక సమస్య వచ్చినా కొందరు చాలా బాధపడుతుంటారు. అంతే కానీ సమస్యకు పరిష్కారం వెతకరు. కాబట్టి మనం ఏదయినా సమస్య వచ్చినప్పుడు బాధపడకుండా దానికి పరిష్కారం వెతకాలి. ఈ మధ్య చాలామంది దానిలోనే సినిమాలు, సీరియళ్లు, షోస్ చూస్తున్నారు కాబట్టి దీని వలన మనం ఎక్కువ సమయం స్క్రీన్ మీద గడుపుతున్నారు. దీని వలన మెంటల్ హెల్త్ ఇష్యూస్ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి మనం  లో సినిమాలు, సిరీస్ లు చూసేటప్పుడు మధ్యమధ్యలో బ్రేక్ ఇస్తూ ఉండాలి దాని వలన మన ఆరోగ్యానికి మంచిది. ఒత్తిడి వలన మనకు గుండె సమస్యలు, ఆస్తమా, హైపర్ టెన్షన్, జుట్టు రాలడం వంటి సమస్యలు వస్తాయి. ఒత్తిడిని, టెన్షన్ ను తగ్గించుకోవడానికి మనం మొదట ఎక్కువగా ఆలోచించడం తగ్గించు కోవాలి. ఇంకా యోగా, ధ్యానం వంటివి చేస్తూ ఉండాలి. వీటి వలన రిలీఫ్ గా ఉంటుంది.

Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**